News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 02 | సంచిక :331 | ఖమ్మం | మంగళవారం జనవరి 14, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## ఇందిరమ్మ మోడల్ హౌస్ రెడీ

### నెల రోజుల్లో నిర్మాణం పూర్తి

- 400 చదరపు అడుగుల గృహం
- ఇవాళ ప్రారంభించిన గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి
- 4 ఏండ్లలో 20 లక్షల ఇండ్లు కట్టడమే లక్ష్యమని వెల్లడి
- పేదోళ్లయితే చాలు..
- ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తం
- కులం, మతం చూసి సంక్షేమ పథకాలు ఇవ్వబోమన్న మంత్రి



ఇందిరమ్మ మోడల్ హౌస్ సిద్ధమైంది. డిసెంబర్ 13న రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి ఖమ్మం జిల్లా కూసుమంచి ఈ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ. 5 లక్షల వ్యయంతో దీని నిర్మాణం పూర్తి చేశారు. హాల్, కిచెన్, అటాచ్డ్ బాత్‌రూంతో బెడ్ రూంను నిర్మించారు. ఇంటి లోప లి గదు లు, ముందు వరండాలో టైల్స్ వేశారు. డాబా మెట్ల కింద టాయిలెట్‌ను నిర్మించారు. ఇంట్లో విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి ఫ్యాన్లు సైతం ఏర్పాటు చేశారు. ఇంటికి రంగులు, ఇతరత్రా వసతులు కూడా కల్పించారు. ఈ మోడల్ హౌస్ కేవలం నెల రోజుల వ్యవధిలో పూర్తయింది. దీనిని ఇవాళ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వివరాలు 2లో..




## హర హర .. మహాదేవ్

### ప్రారంభమైన కుంభమేళా

- భక్తులతో కిక్కిరిసిన ప్రయాగ్రాజ్
- ఉదయం 60 లక్షల మంది పుణ్యస్నానాలు
- వీధుల్లో అఘోరాల నృత్యాలు..
- 3 కోట్లు దాటే చాన్స్



భాగ్యానిచ్చే భోగి, సరదా నిచ్చే సంక్రాంతి, కమ్మని కనుమ, కొత్త సంవత్సరంలోకి కొత్త వెలుగులను నింపాలని కోరుకుంటూ మీకు మీ కుటుంబ సభ్యులకు శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు

### సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు. నేడు(మంగళవారం) సంక్రాంతి పండుగ సందర్భంగా సీకే న్యూస్ కార్యాలయానికి సెలవు కావున పత్రిక పునర్దర్శనం 16.01.2025

## పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- దావోస్ గత పర్యటనలో రూ.40 వేల కోట్లు సాధించాం
- ఈ సారి మరిన్ని ఒప్పందాలు జరిగేలా కృషి
- పరిశ్రమల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తెలంగాణ ఇప్పటికే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారి, దేశం దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. ఫ్యూచర్ సిటీలోని సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. రేవంత్‌రెడ్డి.. మంత్రి శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్‌లో, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. సింగపూర్‌లోని స్కిల్స్ వర్సిటీతో ఒప్పందాలు, వివిధ

వివరాలు 2లో..



## సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు



- తొక్కిసలాట ఘటనలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్న బీఆర్ నాయుడు
- ఇప్పటి వరకు 31 మందికి చెక్కులు ఇచ్చామని వెల్లడి
- తప్పుడు కథనాలను ఎవరూ నమ్మవద్దని విన్నపం

వివరాలు 2లో..

## వైఎస్ బతికి ఉన్నా తెలంగాణ వచ్చేది

### కిరణ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




- రాష్ట్ర విభజనపై 2009లోనే నిర్ణయం
- తెలంగాణకు అనుకూలమంటూ అసెంబ్లీలో తీర్మానం పెట్టుమన్నది ఆయనే
- ఈ బిల్లు పెడితే ఎన్నికలో ఓడిపోతామని చెప్పాను
- తర్వాత ప్రణభ్ ముఖర్జీతో మాట్లాడి 'మేము తెలంగాణకు వ్యతిరేకం కాదు' అని మార్పించారు
- దురదృష్ట వశాత్తూ ఈ రాష్ట్రం విడిపోయింది
- మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## కేసీఆర్ క్షమాపణ చెబితే .. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

- బీఆర్ఎస్ హయాంలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని విమర్శ
- పాడి కౌశిక్ రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తించాడని ఆగ్రహం
- ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్న సంజయ్



బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకు న్నారని, అందుకుగాను కేసీఆర్, కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని, ఆ తర్వాత వారు తమ పదవులకు రాజీనామా చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. అప్పుడే తానూ తన పదవికి

వివరాలు 2లో..

## భోగి వేడుకల్లో కేటీఆర్, హరీశ్ రావు, కవిత..

- ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో భోగి వేడుకలు
- హాజరైన కేటీఆర్, హరీశ్, కౌశిక్ రెడ్డి తదితరులు
- కేబీఆర్ పార్క్ వద్ద వేడుకల్లో పాల్గొన్న కవిత

వివరాలు 2లో..



## వైసీపీ ఎందుకు ఖాళీ అవుతోందో జగన్ తెలుసుకోవాలి

- బెదిరించడం, కక్ష కట్టడం జగన్ నైజమన్న పార్థసారథి
- రోజా అన్నీ గాలి మాటలే మాట్లాడతారని విమర్శ
- కూటమి ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేస్తోందన్న మంత్రి

వివరాలు 2లో..



# ఇందిరమ్మ మోడల్ హౌస్ రెడీ

- మొదటి పేజీ తరువాయి

ఇందిరమ్మ ఇండ్లను పేదలకే అందిస్తామని, కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులందరికీ అందించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏందో ప్రతి తెలంగాణ బిడ్డకు తెలుసని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని ఆనాడు పెద్దలు ఎలా కొల్లగొట్టారో తెలుసని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

మొదటి విడతగా మొదటి సంవత్సరంలోనే నాలుగున్నర లక్షల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించాలని ఒక దృఢ సంకల్పంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తక్కువలో తక్కువ 3500 ఇండ్లు ఇస్తామని చెప్పారు. జనవరి 26 నుంచి పేదలు మెచ్చే మరో నాలుగు సంక్షేమ హామీలు అమలు కాబోతున్నాయని తెలిపారు.

రాబోయే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇల్లు కట్టాలని చిత్తశుద్ధితో ఉన్నట్లు చెప్పారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వము చేయని విధంగా భరోసా కార్యక్రమం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ప్రతి సంవత్సరం పన్నెండు వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమాన్ని రెండు విడుతలుగా శ్రీకారం చుట్టబోతున్నమన్నారు. అనంతరం కూసుమంచి మండలంలోని దుబ్బ తండాలో ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్, ఖమ్మం ఆర్డీఓ, హౌసింగ్ ఈ ఈ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనవరి 26 నుంచి తెలంగాణలో 4 కొత్త పథకాలు అమలు

- మొదటి పేజీ తరువాయి

కోసం ప్రభుత్వం దాదాపు 45 వేల కోట్లకు పైగా ఖర్చు చేయబోతుందని చెప్పారు. సోమవారం (జనవరి 13) రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాల అమలుపై ఖమ్మం కలెక్టరేట్ లోఉప ముఖ్యమంత్రి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు 22 వేల 500 కోట్లు, రైతు భరోసాకు18 వేల కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ కోసం అదనంగా ఖర్చు చేయాల్సి ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేర కట్టుబడి అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతి పథకంపై సంపూర్ణంగా చర్చించిన తర్వాతే మార్గదర్శకాలు జారీ చేశామని స్పష్టం చేశారు. రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు 12 వేల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని, ఉపాధి హామీ జాబ్ కార్డ్ ఉండి భూమి లేని వ్యవసాయ కుటుంబాలు 20 రోజులు ఉపాధి హామీ పని చేసినట్లయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు అవుతుందని క్లారిటీ ఇచ్చారు.

ప్రతి పథకానికి లబ్దిదారులను గ్రామ సభ పెట్టి పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ కమిటీల సభ్యులను భాగస్వామ్యం చేయాలని.. ప్రతి గ్రామ సభలో కార్యక్రమం పెట్టి ప్రభుత్వ లక్ష్యాలు తెలియజేయాలని పేర్కొన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి చేత జాబితా ఆమోదింపచేసుకొని మంజూరు ప్రోసిడింగ్స్ అందజేయాలని తెలిపారు. ఎంత మంది రైతులకు ఎంత రుణమాఫీ జరిగింది, ఎంత మంది రైతు భరోసా వస్తుంది, బోనస్ వచ్చిన రైతుల వివరాలు తెలియజేస్తు గ్రామాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాల నిర్మాణం, మెస్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీల పెంపు, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ వంటి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన మాట మేరకు 21 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశామని.. సన్న రకం ధాన్యం క్వింటాల్ కు 500 రూపాయలు బోనస్ అందించామని తెలిపారు.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- మొదటి పేజీ తరువాయి

సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విదేశీ పర్యటనకు సంబంధించిన ఆరు రోజుల షెడ్యూలు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేయనున్న సమావేశాల ప్రణాళికను అధికారులు వివరించారు. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందాలు, పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతిపై సీఎం ఆరా తీశారు. "నిరుడు దావోస్‌లో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రాగా 18 ఒప్పందాలు కుదిరాయి. వీటిలో పది ప్రాజెక్టుల పనులు మొదలవగా ఏడింటి పనులు ప్రారంభ దశలో ఉన్నాయి" అని అధికారులు వెల్లడించారు. దాంతో "తొలి ఏడాదిలోనే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టా. ప్రభుత్వ పారిశ్రామిక విధానం అందర్నీ ఆకర్షిస్తుంది" అని సీఎం ధీమా వ్యక్తంచేశారు.

# మహా కుంభమేళా 2025 : 12 ఏండ్లకు ఒకసారే ఎందుకు..? సూర్య, చంద్రుడు ఒకే రాశిలోకి వచ్చినప్పుడే ఇలా..!

### ప్రయాగ్ రాజ్ మహాకుంభ్

ఉత్తర ప్రదేశ్ లోని త్రివేణి సంగమ క్షేత్రమైన ప్రయాగ్ రాజ్ లో ఈ సారి కుంభ మేళా జరగనుంది. మాఘమాసంలో బృహస్పతి మేషరాశిలో.. సూర్యుడు, చంద్రులు మకరరాశిలో ఉన్నప్పుడు ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా మొదలవుతుంది. గంగా, యమున, సరస్వతి నదులు కలిసే చోట జరిగే ఈ వేడుకకు 40 కోట్ల మంది హాజరవుతారని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది.

ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు, అఘోరాలు, నాగసాధులు, సాధువులు, పీఠాధిపతులు ఇక్కడ పుణ్యస్నానాల కోసం తరలివస్తారు. ఈ సందర్భంగా జలమంతా జనంతో నిండిపోతుంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఏర్పాట్లు చేస్తున్నాయి. అధునాతన టెక్నాలజీని వినియోగించుకుంటున్నాయి.




ప్రయాగ్ రాజ్ లో త్రివేణి సంగమం వెంబడి ఉన్న ప్రాంతం మొత్తాన్ని ఒక ప్రత్యేక జిల్లాగా గుర్తించి అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. అఘోరాలు, నాగసాధులకు ఉపదేశం చేసి వారికి యోగా విద్యలు నేర్పేందుకు ఉద్దేశించిన అఖాడాలు ప్రయాగరాజ్ కు తరలివస్తాయి. ఈ సారి 13 అఖాడాలు ప్రత్యేకంగా ఇక్కడ బస చేయనున్నాయి. కుంభమేళాను ప్రతి 12 ఏళ్లకే జరుపుకుంటారు. అయితే 12 ఏళ్లకే ఎందుకు చేస్తారనే సందేహం సహజం. ఇందుకు ఓ పురాణగాథ ఉందని భక్తుల నమ్మకం. అమృతం కోసం దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని చిలికినప్పుడు అందులో నుంచి అమృతం బయటకు వచ్చింది. అమృతం తమకే దక్కాలని దేవతలు, రాక్షసులు 12 రోజులపాటు యుద్ధం చేసుకున్నారట. ఆ 12 రోజులే భూలోకంలో 12 సంవత్సరాలని నమ్మకం.

అలాగే యుద్ధం సమయంలో అమృతం ఉన్న పాత్ర నుంచి 12 చుక్కలు కిందకి పడ్డాయని.. అందులో 4 చుక్కలు పలు ప్రదేశాల్లో భూమిమీదకు చేరాయని నమ్ముతారు. అందుకే ఆ ప్రదేశాల్లో కుంభమేళా నిర్వహిస్తున్నారు. ఇక గురు గ్రహం 12 ఏళ్లు 12 రాశుల్లో ఉంటాడు కనుక 12 ఏళ్లకు ఓసారి కుంభమేళా చేస్తారని మరో కథ ప్రచారంలో ఉంది.

### సాగర మథనం స్ఫూర్తిగా లోగో

రాబోయే మహా కుంభమేళాను దృష్టిలో ఉంచుకుని యూపీ యోగి ఆదిత్యానాథ్ ప్రయాగ్ రాజ్ లో లోగోను విడుదల చేశారు. సాగర మథనంలో ఉద్భవించిన అమృత కలశాన్ని లోగోలో ఉంచారు. అలాగే పవిత్ర ప్రయాగ్ రాజ్ సంగమ ప్రదేశాన్ని, హనుమంతుని చిత్రం, ఆలయం, అక్షయవత్ వృక్షం, ప్రకృతికి, మానవులకు మధ్య సంబంధం తెలిపే సనాతన ధర్మానికి సంబంధించిన చిత్రాలను ఇందులో చూడొచ్చు. ప్రజా సంక్షేమం, స్వయం అవగాహన వంటి అంశాలకు మహాకుంభ్ మేళా 2025 లోగో చిహ్నంగా నిలుస్తోంది.

### కుంభమేళా ఓ కొత్త జిల్లా

ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా జరిగే ప్రదేశాన్ని అంతా కలుపుతూ ఓ జిల్లాను ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. ఆ జిల్లాకు 'మహా కుంభమేళా' అని అధికారికంగా పేరును ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 76కి చేరింది. మతపరంగా జరుగుతున్న ఈ వేడుకలో యాత్రికులకు

తగిన ఏర్పాట్లు, భద్రతను కల్పించేందుకుగాను ఈ జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అందువల్ల వారికి మెరుగైన సౌకర్యాలు అందుతాయని వెల్లడించారు.

# కేసీఆర్ క్షమాపణ చెబితే .. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా

- మొదటి పేజీ తరువాయి

రాజీనామా చేస్తానన్నారు.కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తించారని సంజయ్ విమర్శించారు. కౌశిక్ రెడ్డి స్వతహాగా చేశారా? ఎవరైనా రెచ్చగొడితే చేశారా? అనేది తెలియాలన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నివేదిక తెప్పించుకొని చర్యలు తీసుకుంటారని భావిస్తున్నామన్నారు.సంజయ్ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్నే ఎత్తిచూపుతూ నిన్న పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. దాంతో, సమీక్ష సమావేశంలో, మంత్రుల ఎదురుగానే కౌశిక్ రెడ్డి, సంజయ్ మధ్య ఘర్షణ జరిగింది.

# భోగి వేడుకల్లో కేటీఆర్, హరీశ్ రావు, కవిత..

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో భోగి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు హరీశ్ రావు, పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

తదితరులు పాల్గొన్నారు.మరోవైపు కేబీఆర్ పార్క్ వద్ద తెలంగాణ సంస్కృతి ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... హైదరాబాద్ నడిబొడ్డున పల్లె వాతావరణాన్ని సృష్టించి భోగి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. భోగి అంటేనే ప్రతికూలతలను విడిచిపెట్టి కొత్త ఉత్సాహంతో ముందుకు వెళ్లడమని అన్నారు.

# వైఎస్ బతికి ఉన్నా తెలంగాణ వచ్చేది

ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి జీవించి ఉన్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యేదని ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రిగా పనిచేసిన కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఆయన విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఏర్పాటుపై కాంగ్రెస్ పార్టీ 2009లోనే నిర్ణయం తీసుకుందని అన్నారు. 2009 ఎన్నికలకు ముందు తాను

చీఫ్ విప్‌గా ఉన్నానని, ఆ సమంలో వైఎస్సార్ తనను పిలిచి తెలంగాణకు అనుకూలమంటూ తీర్మానం పెట్టాలని సూచించారు. ఇప్పుడు ఈ బిల్లు పెడితే రాష్ట్రంలో అధికారం కోల్పోతామని చెప్పానని అన్నారు. అది పై నుంచి వచ్చిన ఆర్డర్ అని, తప్పక పాటించాలని అన్నారని తెలిపారు.

ప్రణబ్ ముఖర్జీ పంపారని చెప్పారన్నారు. ఒక్క సారి ప్రణబ్ ముఖర్జీతో మాట్లాడాలని రిక్వెస్ట్ చేశానని చెప్పారు. ఈ మేరకు మాట్లాడి స్వల్ప మార్పు చేయించారని అన్నారు. 'తెలంగాణకు మేం వ్యతిరేకం కాదు' అని మార్పించారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటును అడ్డుకోలేకపోయారన్న అపప్రథ తనపై సరికాదని, వైఎస్ ఉన్నా అడ్డుకోలేకపోయేవారని అన్నారు. రాష్ట్ర విభజన జరగదనే తాము అనుకున్నామని.. దురదృష్టవశాత్తు రాష్ట్రం విడిపోయిందని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. వైఎస్ ఉన్నా విభజన ఆగేది కాదని చెప్పారు.

# సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు

వైకుంఠ దర్శనాల కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్ వద్ద చోటు చేసుకున్న తొక్కిసలాటపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందించారు. సోషల్ మీడియాలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని... వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. కొందరు పనికట్టుకుని తనపై

అసత్య ఆరోపణలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. వాస్తవాలను తెలుసుకుని వార్తలు రాయాలని విన్నవించారు.తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆవేదన వ్యక్తం చేశారని చెప్పారు. ఆ ఘటన చాలా దురదృష్టకరమని... భవిష్యత్తులో అలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందారని... మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యులు మూడు బృందాలుగా వెళ్లి మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి చెక్కులు అందించారని బీఆర్ నాయుడు తెలిపారు. 31 మందికి చెక్కులు ఇవ్వడం జరిగిందని... మరో 20 మందికి చెక్కులు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారని వెల్లడించారు.

# వైసీపీ ఎందుకు ఖాళీ అవుతోందో జగన్ తెలుసుకోవాలి

:వైసీపీ అధినేత జగన్ పై ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఎందుకు ఖాళీ అవుతోందో జగన్ తెలుసుకోవాలని అన్నారు. బెదిరించడం, కక్ష కట్టడం జగన్ నైజమని చెప్పారు. ఎన్నికల గురించి జగన్ వి పగటి కలలా లేక రాత్రి కలలా? అని ప్రశ్నించారు. సంక్రాంతి కేవలం కూటమి నేతలకే అని వైసీపీ నేతలు అంటున్నారని...

సంక్రాంతి ఎవరికి అనేది అర్థం లేకుండా, అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని పార్థసారథి విమర్శించారు. మాజీ మంత్రి రోజా అన్నీ గాలి మాటలు మాట్లాడతారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ. 5కే పేదల ఆకలి తీరుస్తున్నామని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల భయాలను పోగొట్టామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ నేతృత్వంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామాలకు సిమెంట్ రోడ్లు వచ్చాయని చెప్పారు.

వైసీపీ పాలనలో రూ. 6,679 కోట్ల విదేశీ పెట్టుబడులు వస్తే... కూటమి ప్రభుత్వ పాలనలో 6 నెలల్లోనే రూ. 85 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్దపెద్ద కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. రూ. 65 వేల కోట్లతో సీబీజీ ప్లాంట్లు పెట్టడానికి అనుమతులు వచ్చాయని తెలిపారు. ఇక, నూజివీడులో గ్రావెల్ తవ్వకాలపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సమాచార లోపంతో మాట్లాడి ఉంటారని చెప్పారు.

## తెలుగు భాష రక్షణ ముసుగులో దోపిడీ

- తెలుగు తల్లి విగ్రహం ఎదుట పంపాన ఆనందరావు కుటుంబ సభ్యులతో నిరసన



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 13 :** గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు భాష రక్షణ అనే ముసుగులో తెలుగు భాష పరిరక్షణ, తెలుగు వెలుగు, ప్రజా ఉద్యమాలు అంటూ తెలుగు తల్లిని అడ్డం పెట్టుకొని తెలుగు భాషాభిమానులను సాహిత్య, రచయితలు కవులను, ఆకర్షించి, వారి వారి ఆర్థిక స్తితులు గుర్తించి తెలుసుకొని వారి నుండి ఏదో విధంగా ధన, వస్తు రూపేనా విరాళాలు స్వీకరించి, తెలుగు అనే ముసుగులో పబ్బం గడుపుకుంటున్న ప్రబుద్ధులు ఎందరో ఇలాంటి వారు తెలుగు రక్షణ ఉద్యమం ఉచ్చులో ఎర వేసి వారి నుండి ఆర్థికంగా దోచుకుంటూ తెలుగుభాష రక్షణ ఉద్యమాలు, దీక్షల పేరుతో కల్లబొల్లి కబుర్లతో మాటల మంత్రాలతో మాయ జాలం చేస్తున్నారని మీకందరికి చేతులెత్తి నమస్కరిస్తూ దయచేసి తెలుగుభాషాభిమానులు కాని, సాహిత్య కళాకారులు కాని, ఇటు భాష ఉద్యమాలు, రక్షణలంటూ విరాళాలు దండుకొనే దగా దండు దోపిడి మాయలో పడకుండా ఉండాలని, మన తెలుగువారి రక్షణకు, ఎవరికి వారే మన ఇంట్లో మన పిల్లలందరికి తెలుగుని నేర్పించి చదవడం, వ్రాయడం నేర్పించి, మన తెలుగు భాషలో మనమందరం ఇంట్లోనే తెలుగు భాషను ఒక వెలుగులా ప్రకాశించాలని, తెలుగుభాష పరిరక్షణకు మనమంతా కంకణధార బద్దులమై ఉండాలని, ఉత్తరాంధ్ర జిల్లాలలోని ఉన్న తెలుగు భాషాభిమానులందరిని వేడుకుంటున్నారు నగరానికి చెందిన తెలుగు భాషాభిమాని పంపాన ఆనందరావు. నేటి ఆధునిక యుగంలో మనకున్న ప్రసార ప్రచార మాధ్యమాలు వాట్సాప్ ఈ-మెయిల్స్ ద్వార మన బాషను రక్షించుకొనుటకు ప్రభుత్వానికి మన వినతులు పంపించాలని, తెలుగు భాష పరిరక్షకులను, సాహిత్య రచయితలను, కవులను తెలుగు కళామతల్లి బిడ్డలందరికి తెలుగు తల్లి సాక్షి గా మిమ్మలందరిని పేరు పేరున విన్నవించుకుంటున్నట్లు పంపాన ఆనందరావు తెలిపారు. ఈ మేరకు మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం ఎదుట కుటుంబ సభ్యులతో పాటు నిరసన తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 13,** భద్రాచలం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఏరియా ఆసుపత్రి కు వెళ్లే దారిలో అపోలో మెడికల్ షాప్ వద్ద విగతజీవిగా ఒక వ్యక్తి పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతుడు గత రెండు,మూడు నెలలుగా ఏరియా ఆసుపత్రి వద్ద, సమీప ప్రాంతాల్లో భిక్షాటన చేసి జీవనం గడిపిస్తున్నాడని, అతను టీబీ వ్యాధితో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే మందులు తీసుకుంటూ వాడుతుంటాడని వెల్లడయింది. దీంతో ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించగా మృతుడు పేరు టి. శంకర్ (55) గా గుర్తించడం జరిగిందన్నారు. అతని చిరునామా వివరాలు రికార్డుల్లో పొందుపరచడాని కి మృతుడు నిరాకరించేవాడని తెలియజేశారు. కావున కుటుంబ సభ్యులు మృతదేహం కొరకు స్థానిక పోలీస్ స్టేషను సంప్రదించాలని ఎస్ ఐ రామకృష్ణ కోరారు.

## గిరిజనులు, విద్యార్థులకు మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు.

- తెలిపిన ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), జనవరి 13,** ఏజెన్సీ ఏరియాల లోని మండలాలు, గిరిజన గ్రామాలలో పనిచేయు చున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, ఏజెన్సీ ఏరియా ఆదివాసి గిరిజన కుటుంబాలకు, విద్యార్థులకు, ఐటీడీఏ కార్యాలయం లోని యూనిట్ అధికారులకు, సిబ్బందికి, భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అందరూ సుఖసంతోషాలు, భోగభాగ్యాలతో విలసిల్లాలని, పంటలు సమృద్ధిగా పండి రెట్టించిన ఉత్సాహంతో గిరిజన రైతులు పండుగలు జరుపుకోవడం తో, అద్భుతమైన, సంతోషమైన ప్రగతిని ఆరోగ్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. మకర సంక్రాంతి మరియు కనుమ పండుగ మన సంస్కృతికి, సాంప్రదాయానికి, వారసత్వానికి ప్రతీకలని, సాంప్రదాయమైన సంక్రాంతి ఉత్సవాలు, అన్ని వర్గాల గిరిజన కుటుంబాల మధ్య బంధాన్ని పెంచుతాయని అన్నారు. ఇలాంటి శుభ సందర్భంలో ప్రేమ, వాత్సల్యం, స్నేహం, సహోదరత్వం వంటి ఆలోచనలు కలగాలని ఆకాంక్షిస్తూ, ప్రతి ఇంట భోగభాగ్యాలను నింపాలని ఇంటిల్లిపాది పండుగను ఎంతో ఆనందంగా సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ మరి ఒకసారి సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.

# పేదోడు అయితే చాలు...!

- కులం, మతం చూసి సంక్షేమ పథకం ఇవ్వం
- ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో అత్యధిక ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దే
- రాబోయే నాలుగు ఏళ్ళల్లో 20 లక్షల ఇళ్లు లక్ష్యం
- ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచిలో నమూన ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



**సికె న్యూస్ ప్రతినిధి,కూసుమంచి :** కులం లేదు.... మతం లేదు... ఏ పార్టీ అని అడగం.... సంక్షేమం ఇస్తే వచ్చేసారి మా పార్టీకి ఓటు వేయాలనే నిబంధన పెట్టం...కేవలం పేదోడు అయితే చాలు ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకానికి అర్హుడేనని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలోని మండల ఆఫీస్ కంప్లెక్స్ లో నిర్మించిన నమూన ఇందిరమ్మ ఇళ్లు ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో ఈ ఆనందం ప్రతిరోజు ఇలానే ఉండే విధంగా ఆ దేవుడు వారిని దీవించాలన్నారు. 2004 నుంచి 2014 వరకు ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఈనాటి తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఇళ్లు పేదలకు కట్టించి ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు.... ఇందిరమ్మ ఇల్లు అంటేనే ఇందిరమ్మ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కావాలని తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకొని ఒక సంవత్సరం పూర్తయి రెండో సంవత్సరంలోకి వచ్చామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏందో ప్రతి తెలంగాణ బిడ్డకు తెలుసని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆనాడు పెద్దలు ఎలా కొల్లగొట్టారో తెలుసని అయినా కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఇచ్చిన ప్రతీ హామీని తెలంగాణ బిడ్డకు ఇస్తూ ఎక్కడా తెలంగాణలో పేదవాడు ఇబ్బంది పడొద్దు అని పేదవాడు కుటుంబం ఆనందంగా ఉండాలని తహతహలాడుతూ ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లమీద ఈ ప్రభుత్వం ఎంత చిత్త శుద్ధితో ఉందో చెప్పడానికి మొదటి విడతగా మొదటి సంవత్సరంలోనే నాలుగున్నర లక్షల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించాలని ఒక దృఢ సంకల్పంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తక్కువలో తక్కువ 3500 ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఉన్నంతవరకు సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. జనవరి 26 నుంచి పేదలు మెచ్చే మరో నాలుగు సంక్షేమ హామీలు అమలు కాబోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఒకటే చెప్పదలుచుకున్నానని తెలంగాణ రాష్ట్రంలో ఉండే పేద వాడి కల నెరవేర్చడం కోసం అర్హులైన ప్రతీ పేదవాళ్ళకి ఈ ఇందిరమ్మ రాజ్యం రాబోయే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇల్లు కట్టాలని చిత్తశుద్ధితో ఉన్నట్లు చెప్పారు. ఎన్ని ఒడి దూడుకులు ఎన్ని ఇబ్బందులు ఎన్ని కుట్రలు కుతంత్రాలు జరిగిన పేదవాడి ముఖములో ఆనందం చూడటం కోసం పేదవాడి కల నెరవేర్చడం కోసం పేదవాడు కూడా ఒక గూడుని ఏర్పాటు చేయడం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని హామీ ఇచ్చారు. రియల్ ఎస్టేట్ కి మార్చిన భూములు తప్ప వ్యవసాయానికి యోగ్యమైన ఎన్ని ఎకరాలు ఉన్నా ఆనాటి ప్రభుత్వం సంవత్సరానికి 10000 ఇస్తే ఈనాడు ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా 12 వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అది పది లక్షలా, 15 లక్షల ఎన్ని లక్షలు అనేది కాదు ఎన్ని కార్డులు అయినా ఇస్తామని తెలిపారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వము చేయని విధంగా భరోసా కార్యక్రమం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ప్రతి సంవత్సరం పన్నెండు వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమాన్ని రెండు విడుతలుగా శ్రీకారం చుట్టబోతున్నమన్నారు. అనంతరం కూసుమంచి మండలంలోని దుబ్బ తండాలో ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్, ఖమ్మం ఆర్డీఓ, హౌసింగ్ ఈ ఈ, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ నోట 'భద్రాద్రి ప్రశస్తి'



- కవిత రూపంలో జిల్లా ఖ్యాతి వర్ణన
- ఏరు ఉత్సవాల్లో ఆకట్టుకున్న ఐఏఎస్ కవితా సంకలనం



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్ ),జనవరి 13,** అపర విజ్ఞానవంతులే ఐఏఎస్ లు అవుతారన్నది అక్షర సత్యం. ఈ ఐఏఎస్ ఉన్నత ఆఫీసరే కాదు...స్వయంగా కవిగా కూడా మారారు. తెలుగులో ఎంచక్కా కవితలు సంధిస్తూ వీక్షితులను ఆకట్టుకుంటున్నారు. ఆయనే భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ యువ ఐఏఎస్ ఆఫీసర్ పి.ఓ బి. రాహుల్.

భద్రాచలం ఐటీడీఏ పిఓగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఓవైపు గిరిజన ప్రగతికి పెద్దపీట వేస్తూ, మరోవైపు సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ తనదైన శైలిలో ప్రత్యేక మార్క్ చూపిస్తున్నారు. ఈ ఐఏఎస్ ఆఫీసర్. గిరి బిడ్డల తెలుగు ప్రజ్ఞకు పదును పెడుతుండటం తో పాటు, గిరిజన ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజన మ్యూజియము ను అంద చందంగా తీర్చిదిద్దటంలో కీలక భూమిక పోషించారు. అంతేకాదు ఇటీవల భద్రాచలంలో జరిగిన ముక్కోటి ఏరు ఉత్సవాల సమయంలో 'భద్రాద్రి ప్రశస్తి' కవిత రూపంలో వివరించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. ఈ కవితలో జిల్లాకు సంబంధించిన అనేక ముఖ్యమైన వాటి గురించి గొప్పగా పేర్కొన్నారు. జిల్లాకు వాటితో ఉన్న పెనుబంధం గురించి అద్భుత వర్ణించారు.

తన తల్లిదండ్రులు స్వయంగా టీచర్లు కావటం, తన సహచరి కూడా బోధనావృత్తి లో ఉండటం, స్వయంగా పిఓ రాహుల్ కు కూడా తెలుగుపై ప్రత్యేక పట్టు ఉండటం గమనార్హం. భద్రాచలం ఐటిడిఏ పిఓ గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్... అన్ని రంగాల్లో తనదైన శైలిలో ముద్ర వేస్తూ... గిరి ప్రగతికి పాటుపడుతున్నారు...

**ఇటీవల ఐటీడీఏ పీవో రచించిన భద్రాద్రి ప్రశస్థి కవిత.**

నల్ల బంగారం సిరులు పురుడు పోసిన గడ్డలో (సింగరేణి బొగ్గు గనులు)
మాగాణపు మాణిక్యాల నిధుల కొనలో (సారవంతమైన పొలాలు)
అడవి తల్లి హరిణి కూనల బుడిబుడి అడుగులలో (జింక పిల్లలు)
కిన్నెరసాని ఏటి దీపుల ఆహ్లాద పడవ ప్రయాణాలలో
కనకగిరుల ప్రకృతి రమణీయతలు కాంచు కాలినడకల మార్గాలలో
పర్ణశాల యందు పరిడవిల్లు తున్న పారవశ్యపు పవిత్ర కుటీరలలో
అరుదైన అటవీ ఉత్పత్తులు అడుగడుగునా అందేటి అంగళ్ళతో (ఇప్ప, కరక్కాయ, అడవి తేనె)
భారజాల లోహ కాగితపు పరిశ్రమల వెలుగు జిలుగులతో (జెన్కో, ఐ టి సి, నవభారత్)
మట్టి గోడల వెదురు గుంజల తాటాకు తడికల నివాసాలతో
అత్యంత వినయం ఆభరణంగా, అసమాన ధైర్యమే ఆయుధంగా గల మా ఆదివాసీల అడ్డయైన
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదారి ఏటి ఒడ్డున తెప్పోత్సవ ఏరు పండుగకు స్వాగతం,
ఓ సీతారామ,
నీ దశదిన దశావతార సాక్షాత్కారాలు, మా భక్తకోటికి వరమాలికలై
నీ చెంత పుణ్య స్నానాలే, నానా పాపాలకు విముక్తి మార్గములై
నీ సన్నిధిలో నిలవడమే, మా జన్మజన్మల పుణ్యఫలములై
నీ యెడల విశ్వాసమే, కష్టాల కడలిలో మాకు దారి చూపే దిక్సూచియై
విధుల వెంట నీ వేగిరమైన నడక, మా ఇంటి ముంగిట మాకో ధన్యమైన వేడుక
త్రయంబక తనూజ ప్రవాహపు పదనిసలే, సహస్రనామ స్తోత్రములుగా
నీ హంస వాహన విహరింపే, మాకు ముల్లోక ప్రదర్శన భాగ్యంగా
నీ ఉత్తర ద్వార దర్శన మహాభాగ్యమే, మాకు దేవదేవతల ఆశీర్వచనంగా
ఓ దశరథ పుత్ర కోశలేంద్ర జానకి వల్లభ, పురుషోత్తమ, రఘునందన, రాఘవ, రామచంద్ర ప్రభూ,
నీ అంగరంగ వైభవమైన ముక్కోటి అధ్యయనోత్సవ శుభ ఘడియల వేళ, ఈ ఆబాల గోపాలాన్ని అనుగ్రహించవయ్యా !!!



## మాట తప్పని మడిమ తిప్పని నాయకుడు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి!

- అన్ని వాగ్దానాలు అమలు చేసి తీరుతాడు!!
- అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 13,** మాట తప్పని మడిమ తిప్పని నాయకుడు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అని, అన్ని వాగ్దానాలు అమలు చేసి తీరుతాడని, అందులో భాగమైన రైతుల కోసం రైతు భరోసా కార్యక్రమాన్ని రైతులకు ఇష్టమైన సంక్రాంతి పండుగ తర్వాత జనవరి 26 నుంచి అమలు చేయనున్నారని అంతర్జాతీయ గాంధీపథం అధ్యక్షులు డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు.

రైతులకు ఇష్టమైన సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రైతు భరోసా ప్రకటించిన ముఖ్యమంత్రి ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పూలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గాంధీపథం నాయకులు చింతలచెర్వు గెర్షోము, గంజి సంపత్, గొర్రెముచ్చు వెంకటరమణ, గుండే రామారావు మరియూ భద్రాచలం రివర్సైడ్ రోటరీ క్లబ్ నాయకులు డా.మడిపెద్ది రమేష్, ధన కొండ రాఘవయ్య లు పాల్గొన్నారు

## రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కొత్వాల.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జనవరి 13,** తెలంగాణా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తోపాటు కాంగ్రెస్ నాయకులు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఖమ్మం లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొంగులేటి కి బొకే ఇచ్చిన కొత్వాల బోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపి, ఆయన నిండు నూరేళ్ళు, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు వై వెంకటేశ్వర్లు, ఉండేటి శాంతివర్ధన్, ఉండేటి ధనయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భారాలు రద్దు చేయాలని భోగిమంటల్లో కరెంటు బిల్లుల దగ్ధం



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 13 :** రాష్ట్ర తెలుగుదేశం జనసేన ఓటమి ప్రభుత్వం విద్యుత్తు ట్రూప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన 16 వేల కోట్ల రూపాయల భారాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సిఐటియు పూర్వ జిల్లా కార్యదర్శి ఏ అజ శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గత 1386 రోజుల నుండి జరుగుతున్న స్టీల్ పరిరక్షణ ఉద్యమ దీక్షా శిబిరంలో సిఐటియు నాయకులు కార్యకర్తలు కూర్చొని దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా అజయ్ శర్మ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర తెలుగుదేశం జనసేన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేస్తామని, స్మార్ట్ మీటర్లు పెట్టబోమని పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. జనవరి బిల్లులో వాడిన కరెంట్ బిల్ కంటే అదనంగా రెండింతలు భారం వేసిందన్నారు. గత ప్రభుత్వం వేసిన భారాలే తప్ప మేము పెంచలేదంటూ ఊదరగొడుతున్నారు. మోడీ తెచ్చిన 2020 విద్యుత్ సంస్కరణలు ఏపీ లో అమలు చేయడంలో వైసీపీకి టీడీపీ ఏమాత్రం వ్యత్యాసం లేదన్నారు. గత ప్రభుత్వం అదానితో చేసుకున్న సౌర విద్యుత్, స్మార్ట్ మీటర్లు ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బాబు, పవన్ లు ప్రజలకు సంక్రాంతి బాగా చేసుకొండని, సుఖసంతోషాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలిపారని, ధరలు భారీగా పెంచడం, ఉద్యోగాలకు జీతాలు రాకుండా,గత ప్రభుత్వ పథకాలు అమలు కాకపోతే ఎలా పండగ చేసుకోవాలో కూడా చెపితే మంచిదని అన్నారు. ఈ ఏడాది విద్యుత్ భారాలు అధికంగా పడతాయి కనుక ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. స్టీల్ ప్లాంట్ ని మోడీ నుండి రక్షించుకుందాం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాటం పండగ దినాల్లో కూడా నిలిచిపోకుండా కొనసాగించిన కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కోవిడ్ సమయంలో కూడా టెంట్ ఆపకుండా నడిచిందని గుర్తు చేశారు. కాబట్టి మోడీ, బాబు, పవన్ ఐన మోసగాళ్ళపై కూడా అదే స్ఫూర్తితో పోరాడాలి. ప్లాంట్ ని నిర్వీర్యం చేయడానికి కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం, విద్యుత్ యూనిట్ ధర 8 రూపాయలు కు పెంచడం, ఉన్న ఉద్యోగులను కుదించడం, గంగవరం నుండి రావలసిన రా మెటీరియల్ అందకుండా చేయడం వంటి కుట్రలను సైతం కార్మికవర్గం ఎదుర్కొని పోరాడుతుందని అన్నారు. ప్రభుత్వ విధానాలపై ఐక్యంగా ఎదుర్కొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి మణి, ఎస్ జ్యోతీశ్వరరావు, ఒమ్మి అప్పారావు, వై రాజు, ఎన్ ప్రకాశ రావు, జి.వి. ఎన్ చలపతి, చంద్రమౌళి, వెంకటరావు, కుమారి, కుమార్ మంగళం తదితరులు పాల్గొన్నారు.

# సఫాయి కార్మికులకు దుప్పట్ల పంపిణీ







**(సీ కే న్యూస్) చేగుంట :** మెదక్ జిల్లా చేగుంట పట్టణ కేంద్రంలోసఫాయి కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేగుంట. మేజర్ గ్రామపంచాయతీ సపాయి కార్మికులకు ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సోమవారం రోజు చేగుంటలో చలికాలం సందర్భంగా చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి చేతుల మీదుగా అయిత పరంజ్యోతి సపాయి కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అయిత పరంజ్యోతి తో పాటు చేగుంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, సొసైటీ డైరెక్టర్ అయిత రఘురాముల,(స్టాలిన్) నర్సింలు, వంజరి శ్రీను,గొల్ల సత్తయ్య, ఎనిగందుల వెంకటి పుట్ట మహేష్, సాయిబాబా, సుధాకర్, కార్తీక్, పి హెచ్ సి రాజేష్ శ్రీహాస్, పంచాయతీ సపాయి కార్మికులు పాల్గొన్నారు

# ఫిబ్రవరి 7న లక్ష డప్పులు వెయ్యి గొంతుల సభను విజయవంతం చేయండి.



**సి కె న్యూస్ జనవరి 13 హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్.** మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాలయాపన చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై యుద్ధం,గంగారం శ్రీనివాస్ మాదిగ ఎం ఎస్ పి హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి
ఫిబ్రవరి 7న 1000 గొంతులు లక్ష డప్పుల మహా ప్రదర్శన ప్రపంచం చూడబోతున్న సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి
బొడ్డు శాంతి సాగర్ మాదిగ
ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి,సోంపల్లి అన్వేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలోఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా
గంగారపు శ్రీనివాస్ మాదిగ , బొడ్డు శాంతి సాగర్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ, బిసి కాలనీలో దప్పు కళాకారులు మాదిగ ముద్దుబిడ్డతో ఫిబ్రవరి 7న లక్ష డప్పులతో వేల గొంతులతో చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలి వర్గీకరణ అమలుకై మాదిగలంతా ఏకంకండి కాంగ్రెస్ ప్రభుత్వంతో తాడోపేడో తెలుసుకుందం అన్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎమ్మార్పీఎస్ , ఎం ఎస్ పి అనుబంధ సంఘాల నాయకులు చిలుక రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొట్టే కళ్యాణ్ మాదిగా మండల నాయకుడు మాచర్ల బాబు మాదిగ వి హెచ్ పి ఎస్ మండల అధ్యక్షుడు చిలుక విజయ్ మాదిగ, రాహుల్ మాదిగ ,బన్నీ ,బొడ్డు రణధీర్ ,కనకం జయపాల్, కుట్టేపూర్ణ చందర్ ,కనకం అక్షయ్, బుర్ర చరణ్ ,మాచల బాబురావు, పండు, మాచర్ల, ఆరోగ్యం, గుండె రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ జిల్లా కబడ్డీ జట్టును అభినందించిన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) జనవరి 13 :** ఈ నెల కర్నూల్ జిల్లాలో 3,4,5 తేదీలలో జరిగిన ఎం. రంగారావు మెమోరియల్ 50 వ అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీలలో ఫైనల్స్ లో బాలికల విభాగం లో విశాఖ జట్టు కర్నూల్ జట్టు పై 10పాయింట్ల తేడాతో ప్రథమ స్థానం సాధించింది .అదే విధంగా బాలుర విభాగం లో ఫైనల్స్ లో విశాఖ జిల్లా జట్టు కర్నూల్ జట్టుమీద 12పాయింట్స్ తేడా తో ప్రథమ స్థానం సాధించి విశాఖ బాలబాలికల జట్టు ఛాంపియన్ షిప్ సాధించారు.ఈ సందర్భంగా క్రీడాకారులుకి శివాజిపాలెం విశాఖ సౌత్ ఎమ్మెల్యే ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వంశీ కృష్ణ శ్రీనివాస్ తన స్వగ్రామం లో క్రీడాకారులుని అభినందనలు తెలియజేసారు. మరిన్ని విజయాలు సాధించాలని, తమవంతు సహాయ సహకారాలు ఎల్లపుడూ వుంటాయని అన్నారు.
ఈ కార్యక్రమం లో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైసింగ్ సెక్రటరీ ఊరుకుటి శ్రీనివాసరావు, ఎం ఉమా శంకర్ బాబు, వి బాబురావు, ఎం గణపతి రావు,న. ప్రకాష్, పి కోటేశ్వరరావు సెక్రటరీ,పి సత్యనారాయణ, శివ, సత్యనారాయణ, కృష్ణ,కోచ్ వసంత్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించిన దుబ్బాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ హుస్సముద్దీన్



**(సీ కే న్యూస్) చేగుంట :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని దుబ్బాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లిసయ్యద్ హుస్సముద్దీన్ రాయల్ ప్రీమియం లీగ్ చేగుంట మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు ముఖ్య అతిథిగా
చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ హాజరై వడియారం పాస్నైట్ కాలేజ్ మైదానంలో టోర్నమెంట్‌ను ప్రారంభించారు . ఈ సందర్భంగా క్రీడాకారులను ఉత్సాహపరచడానికి నాయకులు క్రీడాకారులతో కలిసి ఆడారు. మూడురోజుల పాటు జరిగే టోర్నమెంట్ పోటీల్లో 19 టీంలు ఆడనున్నాయి ఈ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొల్ల ప్రశాంత్ చేగుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్ ఉపాధ్యక్షులు బొయిని శ్రీకాంత్ ప్లేయర్స్ ఆర్ కే గౌడ్ దాసరి నవీన్ , అన్నం సాయి ఏం డి వసీమ్ బండారి బ్రదర్స్ కెప్టన్ పులి మహేష్ గమే చెంగేర్స్ కెప్టెన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

# శ్రీ గోదా రంగనాయకుల కళ్యాణ మహోత్సవం

- **పట్టు వస్త్రాలు సమర్పించిన సోలిపురం వెంకట్ రెడ్డి భాగ్యరేఖ కుటుంబ సభ్యులు .**



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 13.** యాదాద్రి మండల పరిధిలోని మాందాపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి రంగనాయకుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు పూజా కార్యక్రమాలు అనంతరం చక్కని వేదికపై గోదారంగనాయకులను వేయించింపజేసి అర్చకులు సేనాపతి వెంకటరమణచార్యులు. విశ్వసేన భరద్వాజ చార్యులు.. గణపతిపూజ.పుణ్యాహవచనం. కంకణ ధారణ మాంగల్య ధారణ తలంబ్రాలు ఘట్టాలు, ఆధ్యాత్మిక పరంగా నిర్వహించి మంగళ హారతులు సమర్పించారు ఈ గోదాదేవి కళ్యాణం యొక్క విశిష్టత ఏమిటి గోదాదేవి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఏ విధంగా ఆరాధించేవారు ఇలా తదితర చరిత్ర అక్కడికి వచ్చిన భక్తులందరికీ అర్చకులు అనుగ్రహ భాషణ చేశారు. గోదాదేవి రంగనాథ స్వామి అన్యుని జీవితము చరిత్రను కూడా వివరించినారు. వచ్చిన భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించినారు మొక్కులు తీర్చుకున్నారు.
అనంతరం గుడి నిర్మాణదాత సోలిపురం వెంకట్ రెడ్డి భాగ్యరేఖ దంపతులు కళ్యాణంలో పాల్గొని పట్టు వస్త్రాలు సమర్పించారు వచ్చిన భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి తీర్థప్రసాదాలు తీసుకొని మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోలిపురం సాగర్ రెడ్డి సోలిపురం ఉపేందర్ రెడ్డి సోలిపురం నారాయణరెడ్డి మాజీ జెడ్పిటిసి కుసంగి రాములు వ్యాపారవేత బెలిదే లక్ష్మీ నరసయ్య దంపతులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా శ్రీ శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు.



**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 13.** జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వెంకటాపురం నందు నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలలో భాగంగా ఈరోజు తేది:13.01.2025 సోమవారం రోజున శ్రీగోదారంగనాథ స్వామివార్ల కళ్యాణ మహోత్సవం అర్చకులు, వేదపండితులచే అంగరంగ వైభవంగా భక్తజన సమూహంతో కన్నుల పండుగగా నిర్వహించడమైనది. అనంతరం “నాట్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్” నల్లగొండ వారిచే కూచిపూడి, భరతనాట్యం మరియు “చిందు యక్షగాణ కళాబృందం వారిచే మాయ సుభద్ర” నాటకం నిర్వహించడం జరిగింది. దేవస్థానం చైర్మన్ %ు%కార్యనిర్వహణాధికారిచే శ్రీ గోదారంగనాథ స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందచేశారు. జంగారెడ్డి పల్లి వాస్తవ్యులు శ్రీ బద్దం పుల్లారెడ్డి దంపతులచే భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ శ్రీ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు, ధర్మకర్తలు శ్రీ కొడితాల కరుణాకర్, శ్రీ అర్రూర్ వెంకటేష్, శ్రీ రేఖల ప్రభాకర్, శ్రీ మైల్ల అంజయ్య, శ్రీ బండి రవికుమార్, శ్రీ గుండు జగన్ మోహన్ రెడ్డి, శ్రీ అంబాల ఊషయ్య, శ్రీ ఈతాప రాములు, శ్రీమతి జక్కల కేతమ్మ, శ్రీ కొమిరె బాలేశ్వర్ మరియు మాజీ %వీ్రూ%. నూతి రమేష్ రాజ్ దంపతులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వాకిటి అనంతరెడ్డి , మండల నాయకులు, గ్రామ పెద్దలు, అర్చకులు మరియు సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),జనవరి 13,** రాష్ట్ర ప్రజలకు అదేవిధంగా నియోజకవర్గ ప్రజలకు కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వరం నిండిన జీవితం దక్కాలని, పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమానంతో కలిసి హర్షాతిరేకల జరుపుకుంటూ శాంతిశాన్ని పంచుకోవాలని, రైతు, కార్మిక సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధి వంటి అంశాల్లో నియోజకవర్గం ముందడుగు వేయడంలో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పండుగ వేల ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వ శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# యువత కేసులలో ఇరుక్కో వద్దు- బెట్టింగులకు, జూదాలకు దూరంగా ఉండాలి

**ఈ బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్**



**సి కె న్యూస్, పినపాక నియోజకవర్గం జనవరి 13,** సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఏడూళ్ళ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం పినపాక మండల పరిధిలోని పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడారు. ముందుగా మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోడిపందాలను ఉద్దేశించి మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా కోడిపందాలు ఆడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, పందెపు రాయుళ్లను ప్రత్యేకమైన ఫోర్స్ తో పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వహుకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు కాకుండా సాంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడీ పందేలు, పేకాట, గుండాట ఇలా ఏ జూద వ్యసనమైనా ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమన్నారు. కోడి పందేల జూదరులు, పేకాట నిర్వహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు చెప్పారు. కోడి పందేలు, జూదాల వల్ల ప్రజలు సులభంగా డబ్బులు సంపాదించాలని ఆశ పడి పందేలు కాసి డబ్బును నష్టపోతున్నారన్నారు.
దీనివలన వారి కుటుంబాలలో పండగ పూట కుటుంబం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా మండలంలో కోడి పందేలు నిర్వహించినా,పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసలై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే వారి యొక్క భవిష్యత్తు అంధకారం అవుతుందని, ఇతర దేశాలలో ఉద్యోగాల కొరకు వెళ్లే వారికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో, పాస్ పోర్టు పొందే సమయాలలో ఈ కేసులు అడ్డంకిగా మారి యువత యొక్క జీవితాలు అధోగతి పాలవుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేలు ఆడినా, జూదం ఆడినా సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## దుబ్బాక మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



(సీ కే న్యూస్) చేగుంట దుబ్బాక మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు. దుబ్బాక మండలంలోని అప్పనపల్లి, పెద్ద గుండవెల్లి, బల్వంతపూర్, గంభీర్ పూర్, ఆకారం గ్రామాలలో సీసీ రోడ్లు ప్రారంభించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి . ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధికి కంకణ బదులమై పనిచేస్తున్నామని రాబోయే జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించుకుంటే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్షాలు చెప్పే మాటలు నమ్మి మోసపోతే దుబ్బాక ఇప్పటికే 10 సంవత్సరాలు వెనక పోయిందని ఇంకా వెనుకకు పోతుందని దీనిని గ్రహించి ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజాసేవకే అంకితమైన ముద్దసాని నరసింహారెడ్డి సంతాప సభ.



సి.కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి.

సంతాప సభలో కంచర్ల రామకృష్ణారెడ్డి టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక.

ముద్దసాని నరసింహారెడ్డి మొగిలి పాక మాజీ సర్పంచ్ తన చిన్ననాటి నుండి ప్రజాసేవకే అంకితమై తన జీవితాంతం కృషి చేశాడని టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు మొగిలి పాకలో ముద్దసాని నరసింహారెడ్డి సంతాప సభ మామిడి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది.

సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం పాటుపడిన వ్యక్తి అని ఆయన అన్నారు. గ్రామంలో ఏ ఒక్క కుటుంబానికి ఏ ఒక వ్యక్తికి ఇబ్బంది అయినా కులము చిన్న పెద్ద తేడా లేకుండా సేవ చేసిన వ్యక్తి అని ఆయన కొనియాడారు ప్రజల కోసం పనిచేసినటువంటి నరసింహారెడ్డికి సభకు ముందు రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. మొగిలి పాకలో చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచినగొప్ప వ్యక్తికి విగ్రహము పెట్టాలని సభలో తీర్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సంతాప సభ నిర్వాహకులు ముదసాని శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్తిరెడ్డి, పబ్బు ఎల్లయ్య, గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు మర్రి మోహన్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి సిపిఐఎం మండల నాయకులు మొగిలిపాక గోపాల్ , బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు రాచకొండ కృష్ణ నరసింహారెడ్డి కుమారులు ముద్దసాని నరోత్తం రెడ్డి ముద్దసాని నవీన్ రెడ్డి అల్లుడు దుర్గారెడ్డి పులిపలుపుల రాములు మాజీ సర్పంచులుజక్క గణేష్ రెడ్డి జక్కుల శంకరయ్య మాజీ ఎంపీటీసీ శ్రీలత రమేష్, సామఇంద్రారెడ్డి, మొగిలి పాక పాపయ్య, నరేంద్ర చారి, నాయకులు యాస అంజిరెడ్డి నిషాకర్ రెడ్డి మహంకాళి సిద్దయ్య గంట బిక్షపతి మచ్చ మల్లేశం, మాజీ అధ్యక్షులు మర్ల మల్లేశం, వెంకన్న, సింగల్ విండో మాజీ డైరెక్టర్ జక్క నరసింహారెడ్డి, జడిగే నరసింహ, మచ్చ స్వామి, తదితరులు పాల్గొన్నారు

## వలిగొండ మండలం ప్రజలకు రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు.



సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జనవరి 13.

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య మీడియాతో మాట్లాడుతూ.

వలిగొండ మండల ప్రజలకు మరియు రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శు భాకాంక్షలు తెలిపినారు. తెలంగాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారుల కుటుంబాలను తెలంగాణ ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి గారు ఆదుకోవాలని. ఎలక్షన్ ముందు మాట ఇచ్చి మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన విధంగా సంక్షేమ పథకాలు ఉద్యమకారులకు అందజేయాలని.

ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, వయసు మీరిన వారికి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఇల్లు లేని వారికి ఇండ్లు ఇవ్వాలని, ఉద్యమకారులకు ఐడెంటి కార్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఇన్సూరెన్స్ అవకాశం కల్పించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని, తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాటం చేసిన ఉద్యమకారుల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి చాలా కుటుంబాలుఉన్నాయని, ఉద్యమకారుల కుటుంబాల కోసం త్వరగా నిర్ణయం తీసుకొని ఆదుకోవాలని కోరినారు.

# మంద జగన్నాథం పోరాటయోధునికి శ్రద్ధాంజలి ఘటించిన చేగుంట ఎమ్మార్పీఎస్ నాయకులు




(సీ కే న్యూస్) చేగుంట:చేగుంట మండల కేంద్రంలో సోమవారం నాడు మంద జగన్నాథంకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎలుగెత్తి చాటి దాని పరిష్కారానికి ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ ను లేవనెత్తిన పోరాటయోధుడు మంద జగన్నాథం ఎన్ వెంకటస్వామి అనే ఐఏఎస్ అధికారితో కలిసి అరుంధతియా ఆది జాంబవ సంఘం ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణను సాధించడానికి ఎంతగానో కృషిచేసి కొనసాగింపుగానే ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగింది. ఎమ్మార్పీఎస్ ఉద్యమం మొదలైన సందర్భంగా ఉధృతంగా నడుస్తున్న రోజుల్లో రాజకీయవేతగా మంద జగన్నాథం పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నంతకాలము ఢిల్లీలో తన ఇంటినే ఎమ్మార్పీఎస్ కార్యాలయం గా మార్చాడు ఢిల్లీ కేంద్రంగా ఎస్సీ వర్గీకరణ జరగడానికి చేసిన ప్రయత్నాలకు తన తోడ్పాటును అందించాడు ఎంఆర్పిఎస్ ఉద్యమం ఒడిదుడుకులు ఎదుర్కొన్న ప్రతి సందర్భంలో తన అండదండలు అందించాడు ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలని స్వార్థపర శక్తులు పాలకవర్గాలు కుట్రలు పండిన సందర్భంలో ఎమ్మార్పీఎస్ ను శక్తివంతంగా నిలబెట్టుకోవడానికి మంద జగన్నాథం అందించిన అండదండలు చేసిన సహకారము ఎప్పటికీ మరువలేనిది ఎమ్మార్పీఎస్ చేగుంట మండలం కమిటీ తరపున ఘనమైన నివాళులు అర్పిస్తున్నాం

జోహార్ జోహార్

ఇందులో పాల్గొన్న వాళ్లు కొలుపుల రామస్వామి మాదిగ ఎమ్మార్పీఎస్ చేగుంట మండల అధ్యక్షులు నీల రాములు మాదిగ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు బక్క సాయి బాబా మాదిగ మండల కోశాధికారి వరిగంటి నరేష్ మాదిగ రుక్మాపూర్ గ్రామ అధ్యక్షులు పెద్దింటి అఖిల్ మాదిగ మైలారం బాబు మైలారం స్వామి తదితరులు పాల్గొనడం జరిగింది

## ఉద్యమకారుడిగా మందా జగన్నాథం పోషించిన పాత్ర మరువలేనివి



పెబ్బేరు మండల బీఆర్ఎస్ నాయకులు...

పెబ్బేరు జనవరి13 (సి కే న్యూస్)తెలంగాణ ఉద్యమకారుడిగా మందా జగన్నాథం పోషించిన పాత్ర మరువలేనిదని, ఆయన మరణం తెలంగాణకు తీరని లోటు అని పెబ్బేరు మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.మండల నాయకులు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యులు మంద జగన్నాథం మరణం బాధాకరం అని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు రాష్ట్రంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం మందా జగన్నాథం ఎనలేని కృషి చేశారని,వారి అకాల మరణం రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు గా ఉండి ఎంతో అభివృద్ధి చేసారని మాజీ ఎంపీ డాక్టర్ మందా జగన్నాథం బడుగు బలహీన వర్గాలకు ఎంతో కృషి చేశారని తెలిపారు.ఆయన వల్ల ఎంతో మంది రాజకీయంగా కూడా ఎదిగారని గుర్తు చేశారు.వారి అకాల మరణం దురదృష్టకరమని,మంద జగన్నాథం ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వనం రాములు, పట్టణ అధ్యక్షులు దిలీప్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రె స్వామి,కౌన్సిలర్లు మేకల ఎల్లయ్య,గోపిబాబు,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విశ్వరూపం,రాజశేఖర్,ఎద్దుల సాయినాథ్,సోషల్ మీడియా కన్వీనర్ వడ్డె రమేష్,బాలస్వామి,సందీప్,వెంకటయ్య,సురేష్,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మొగలిగిద్దలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయ ప్రాంగణంలో కూచిపూడి నాట్య ప్రదర్శన

హైదరాబాదులోని శ్రీకృష్ణ నృత్య కళాశాల ఆధ్వర్యంలో



సి కే న్యూస్ షాద్ నగర్ :జనవరి 13:షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలోనీ మొగలిగిద్ద గ్రామంలోగల శ్రీ రంగనాయక స్వామి దేవాలయం రంగంలో హైదరాబాద్ కు చెందిన శ్రీకృష్ణ నృత్య కళాశాల అధ్యాపకురాలు పిన్న జ్వాలాముఖి ఆధ్వర్యంలో 12 మంది నృత్య కళాకారులచే దేవాలయం యొక్క ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేయడం జరిగింది. ఈ ప్రదర్శన గ్రామస్తులకు ఎంతో ఆకట్టుకుంది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అనుమారి వెంకటయ్య కక్కునూరి వెంకటేష్ గుప్తా బొబ్బిలి ఋషి రెడ్డి ,రాజు నృత్య కళాశాల అధ్యాపకులు మెరుగు యాదగిరి, ఎస్ టి ఎస్ పురుషోత్తమ చార్యులు,గ్రామస్తులు తుపాకుల రవి, ఈసరి ప్రశాంత్ యువకులు ,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## షాద్ నగర్ గ్రేడ్-1 గ్రంథాలయ పాలకవర్గం ఏర్పాటు




- చైర్మనుగా కొప్పుల మదన్మోహన్ రెడ్డి
- వైస్ చైర్మనుగా నక్క బాల్ రాజ్ యాదవ్
- ప్రధాన కార్యదర్శిగా క్యూసెట్ శ్రీను
- ఆర్గనైజర్ ఏ మీడియా సెక్రటరీ గా అల్వాల దర్శన్ గౌడ్
- షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, వీర్లపల్లి శంకర్ వెల్లడి
- ఈనెల 19వ తేదీన ప్రమాణ స్వీకారోత్సవం

సి కే న్యూస్ షాద్ నగర్ :జనవరి 13:రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయం అభివృద్ధి కమిటీని స్థానిక ఎమ్మెల్యే వీలపల్లి శంకర్ ప్రకటించారు. ఈనెల 19వ తేదీన గ్రేడ్ – 1 గ్రంథాలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందని, అందరికీ ఆమోదయోగ్యమయ్యే విధంగా జాబితా సిద్ధం చేశామని పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీకి ఎంపికైన జాబితాను వారికి అందజేశారు. ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పారదర్శకత, ప్రాముఖ్యతతో చైర్మన్ మరియు వైస్ చైర్మన్ లతో పాటు సభ్యులను ఏకగ్రీవం చేసే విధంగా తీర్మానించామని అన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఇదే..

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మనుగా కే. మదన్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్లుగా నక్క బాలరాజ్, వీరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా క్యూసెట్ శ్రీను, సంయుక్త కార్యదర్శులుగా కుమ్మరి చంద్రశేఖర్, సింగపాగ అనిల్ కుమార్, ఆర్గనైజర్ మరియు మీడియా ఇంచార్జ్ గా అల్వాలదర్శన్ గౌడ్, సభ్యులుగా పటేల్ రోడ్డు ఫయాజ్, కత్తి చంద్రశేఖర అప్ప, కాట్ నా రాజేష్, కృష్ణారెడ్డి, శివరాములు యాదవ్, ఆలోనిపల్లి రాజు గౌడ్,

రవి నాయక్, జుట్టు అనిల్ కుమార్ తదితరుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, బస్వం అప్ప, కృష్ణారెడ్డి, అగ్గనూరి విశ్వం అప్ప, బాలరాజ్ గౌడ్, శ్రీశైలం గౌడ్,రమేష్, కొప్పుల మదన్మోహన్ రెడ్డి,నక్క బాల్ రాజ్ యాదవ్,క్యుసెట్ శ్రీను, కత్తి చంద్రశేఖర్ అప్ప, కుమ్మరి చంద్రశేఖర్,రాజు గౌడ్, అల్వాల దర్శన్ గౌడ్,చీపిరి శివరాములు యాదవ్, దేవగిరి అశోక్, ఖదీర్,ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



పెబ్బేరు జనవరి13 (సి కే న్యూస్)సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నందు యూత్ కాంగ్రెస్ %౮% కాలనీ యువకుల ఆధ్వర్యంలో మహిళమానులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి రెడ్డి తెలిపారు.మొదటి బహుమతి రంగం నరసింహ్మ, రెండవ బహుమతి రాజేష్, మూడవ బహుమతి జై కిసాన్ ఫర్టిలైజ్, స్పాన్సర్స్ గా ముందుకు వచ్చారని తెలిపారు.దీనితో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సహక బహుమతులు అందజేశారు.మొదటి బహుమతి జ్యోతి శరణ్య,మహిళా గెలుచుకోగా,రెండవ బహుమతి గాయత్రి, లక్ష్మి మూడవ బహుమతి సింధూర, సిరి నల్గొవ బహుమతి సంధ్య, సరిత ముగ్గుల పోటీలో బహుమతులు గెలుచుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్,నర్సింహ్మ,గోపాల్,కాలనీ యువత పాల్గొన్నారు.

## వైయస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతులు అందజేత




సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ ఆత్మకూర్(ఎం) జనవరి 13

సంక్రాతి పండుగ సందర్భంగా లింగరాజుపల్లి గ్రామంలో వైయస్సార్ ఫౌండేషన్ అధినేత ఎర్ర సోమిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.మొదటి విజేతకు 4000 వేల రూపాయలు రెండొవ విజేతకు 3000 వేల మూడోవ విజేతకు 2000 వేల రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో,నాయకులు ఎర్ర సోమిరెడ్డి కావటి స్వామి,ఎర్ర అమృత రెడ్డి, ఎడ్ల రఘుపాల్ రెడ్డి మెట్టు జీతందర్ రెడ్డి ఎర్ర యాదిరెడ్డి,దుర్గం యాదుమల్లి ఎడ్ల జానరెడ్డి,ఆంబోజు అంజయ్య, గోవర్ధన్ రెడ్డి ఎడ్ల మల్లారెడ్డి, ఎర్ర నరేందర్ రెడ్డి ఎర్ర నవీన్ రెడ్డి, ఇంజమూరి నాగరాజు, భూషిపాక నరేష్,భూషి మహేష్, బాబు మరియు గ్రామ మహిళలు యువకులు పాల్గొన్నారు

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# మళ్లీ వచ్చిపడుతున్న మాయదారి వైరస్ లు

అదిగో పులి అంటే ఇదిగో తోక అనే ప్రపంచం. అందుకే ఇప్పుడు తుమ్మినా దగ్గినా భయం. రోగనిరోధక శక్తి తక్కువుంటేనో, సీజన్ మారితేనో.. చిన్నాచితకా అనారోగ్య సమస్యలు కామన్. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే నాలుగురోజుల్లో అంతా నార్మల్. కానీ కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన తర్వాత ఇప్పుడు కాస్త పడిశం పట్టినా, గొంతు గరగరమన్నా గుండెల్లో దడే. కడుపులో కాస్త మందంగా అనిపిస్తే ఒకప్పుడు ఓ పూట పత్యంచేస్తే సెట్టయ్యేది. కానీ ఇప్పుడు ఏ దిక్కుమాలిన వైరస్ శరీరంలోకి ప్రవేశించిందోనని అనుమానం హార్ట్‌బీట్ పెంచేస్తోంది. ఏం చేస్తాం మరి.. మళ్లీ వచ్చిపడుతున్నాయ్ మాయరోగాలు.చైనాకు రోగమొచ్చింది. ప్రపంచమంతా వణికిపోతోంది. కేసుల ఊసులేదు. ఊహాజనిత ప్రచారాలే తప్ప అధికారికంగా మరణాల సంఖ్య కూడా తెలీదు. చైనాలో మెడికల్ ఎమర్జెన్సీ డిక్లేర్ చేశారంటూ అనధికార వార్తలు. హెచ్ఎంపీ వైరస్ ..హ్యూమన్ మెటా న్యూమో వైరస్. కరోనాకి కజిన్‌లాంటిదే ఈ వైరస్ కూడా. కరోనా ప్రపంచాన్ని కుదిపేసింది. లక్షల ప్రాణాలను గాల్లో కలిపేసింది. మరి హెచ్ఎంపీవీ కూడా అంతే ప్రమాదమా అంటే అవునని చెప్పలేం. ప్రాణాంతకం కాదని కొట్టిపారేయలేం. ఎందుకంటే కరోనా సీజన్‌లో భయమే మనిషిని చంపేసింది. కరోనా వేరియంట్లలాగే హెచ్ఎంపీ వైరస్ టార్గెట్.. మన శరీరంలోని ఊపరితిత్తులే. అసలే కరోనా ప్రభావంతో లంగ్స్ వీకైపోయాయి. ఈ టైంలో కొత్త వైరస్ ఎఫెక్ట్‌పడితే ఏం జరుగుతోందనని భయం.ఓపక్క వైరస్‌ల పుట్టినింట్లో హెచ్ఎంపీ వైరస్ కల్లోలం సృష్టిస్తోందన్న ప్రచారం జరుగుతున్న సమయంలోనే.. అగ్రరాజ్యంలో నోరో వైరస్ వణికిస్తోంది. మరోవైపు పక్షులు, పశువులకే పరిమితమనుకునే బర్డ్‌ఫ్లూతో అమెరికాలో తొలిసారి ఒకరు మృత్యువాత పడ్డారు. అడవి పక్షులకు దగ్గరగా వెళ్లడంతో హెచ్5ఎన్1 సోకి ప్రాణాలు కోల్పోయాడు 65ఏళ్ల వ్యక్తి. వాస్తవానికి కరోనా తర్వాత ప్రపంచమంతా అంతగా చర్చ జరుగుతోంది హెచ్ఎంపీ వైరస్ గురించే. ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ వైరస్ బారినపడుతున్నట్లు కథనాలొస్తున్నాయి. శీతాకాలం అంటువ్యాధులు త్వరగా ప్రబలుతుంటాయి. జలుబు, జ్వరం, దగ్గు, శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఈ సీజన్‌లో సర్వసాధారణం. చాలామంది వీటికి ఏ టాబ్లెట్టో వేసుకుని ఉపశమనం పొందుతుంటారు. కానీ ఇప్పుడు కొంపదీసి కొత్త వైరస్సేమో అనే భయంతో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇమ్యూనిటీ సిస్టమ్ తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధులపై హెచ్ఎంపీ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పెద్దగా భయపడాల్సిన పన్లేదన్న మాట బలంగా వినిపిస్తున్నా.. కోవిడ్ 19కంటే తక్కువ ప్రమాదమేం కాదన్న వాదనకూడా వినిపిస్తోంది. ప్రస్తుతానికైనా ఈ వైరస్‌కి వ్యాక్సిన్ లేదు. అలాగని ఇదేం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిన వైరస్ కాదు. హెచ్ఎంపీ వైరస్ ప్రచారంతోనే జనం ఉక్కిరిబిక్కిరవుతుంటే.. మరోవైపు నోరో వైరస్ విజృంభిస్తోందన్న వార్తలు మరింత భయపెడుతున్నాయి. అమెరికాలో నోరో వైరస్ రోజురోజుకీ తీవ్రమవుతోంది. యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ డేటా ప్రకారం ఆ దేశంలో నోరో వైరస్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. నవంబరు నుంచీ అగ్రరాజ్యంలో ఆ వైరస్ బాధితులు పెరుగుతున్నారు. నోరో వైరస్ జీర్ణకోశానికి సోకే వ్యాధి. బాధితులనుంచి నోరో వైరస్ ఇతరులకు వేగంగా సోకే అవకాశముంది. 12నుంచి 48 గంటల తర్వాత లక్షణాలు కనిపిస్తాయి. అతిసారం, వాంతులు, వికారం, కడుపు నొప్పి, జ్వరం, తలనొప్పి, బాడీ పెయిన్స్ ఉంటాయి. వైరస్ సోకిన రెండు రోజులపాటు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తర్వాత తగ్గుముఖం పడుతుంది. నోరో వైరస్ కూడా కొత్తదేం కాదు. అమెరికాకి ఇప్పుడు సోకింది కాబట్టే ప్రపంచం ఉలిక్కిపడుతోందంతే. గతంలోనే తెలుగురాష్ట్రాల్లో ఈ వైరస్ లక్షణాలపై ప్రజలను ప్రభుత్వాలు అప్రమత్తం చేశాయి. ఆరునెలల క్రితమే హైదరాబాద్‌లో 100కు పైగా కేసులు నమోదయ్యాయి. పాతబస్తీలో తొందరగా వ్యాప్తిచెందిన నోరో వైరస్‌పై అప్పట్లో జీహెచ్ఎంసీ ప్రజలను అప్రమత్తంచేసింది. వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల జాబితాలోనే నోరో వైరస్ కూడా ఉంది. పారిశుద్ధ్యం, కలుషిత ఆహారంతోనే ఈ వైరస్ వ్యాప్తిచెందుతుందని గుర్తించారు. ముఖ్యంగా ఈ వైరస్ మధ్య వయస్కులు, వృద్ధులు, గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికల్లో కిడ్నీ ఇన్ఫెక్షన్స్ కలిగిస్తుందని వైద్యులు చెబుతున్నారు. నోరో వైరస్ కంటే బర్డ్‌ఫ్లూనే ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ఓ పక్క ఈ మాయదారి రోగాలేంటని ప్రజలు తలపట్టుకుంటుంటే.. అటు మార్కెట్లు కూడా షేకవుతున్నాయి. చైనా తర్వాత భారత్‌ను తాకిన హెచ్ఎంపీవీపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలి సారిగా స్పందించింది. ఈ వైరస్ ను సాధారణ వైరస్‌గా చిఊూ అభివర్ణించింది. హెచ్ఎంపీ వైరస్ అంటే హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కొత్తది కాదని..దీనిని 2001లోనే గుర్తించామని సంస్థ తెలిపింది. ఇది చాలా కాలంగా ప్రజలలో ఉంది.. ఈ వైరస్ ప్రభావం శీతాకాలంలో పెరుగుతుందని పేర్కొంది.

చైనాలో అనేక హెచ్ఎంపీ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఈ వైరస్ కేసులు భారతదేశంలో కూడా వెలుగులోకి రావడం మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల ఆందోళన మరింత పెరిగింది. ఈ వైరస్ కూడా కరోనా లాంటి వినాశనానికి కారణమవుతుందా అంటూ రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ప్రజలు భయాందోళన చెందవద్దని ఇటీవల ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు చిఊూ కూడా ఈ విషయాన్ని స్పష్టం చేసింది.ప్రపంచంలో ఎక్కడ యుద్ధమేఘాలు కమ్ముకున్నా, ఎక్కడ ఏ వైరస్ వ్యాపించినా ముందు కుప్పకూలేది స్టాక్‌మార్కెట్లే. హెచ్ఎంపీ వైరస్ ప్రభావం ప్రజలపైనే కాదు.. ఇటు స్టాక్‌మార్కెట్లపైనా పడింది. దేశంలో కొత్త వైరస్ కేసులు వెలుగుచూడగానే భల్లూకపు కౌగిట్లో చిక్కుకుంది మన స్టాక్‌మార్కెట్. ఈ వారం రోజుల్లోనే దాదాపు 15లక్షలకోట్ల మేర మదుపరుల సంపద ఆవిరైంది.

# యుక్తవయసులోనే రక్తపోటు, మధుమేహం సమస్యలు

## అనారోగ్యకర ఆహారం, జీవనశైలి దుష్ఫలితాలు

## కొలన్ లేదా రెక్టమ్ కేన్సర్ ముప్పు



వయసు మీద పడుతుంటే అనారోగ్య సమస్యలు పలకరిస్తుండడం సహజం. కాల క్రమేణా కణాల నష్టం కారణంగా ఇవి తలెత్తుతాయి. అంటే, యుక్త వయసులో ఉన్న వారికి వ్యాధుల ముప్పు ఉండదని కాదు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా కొన్ని రకాల వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం యువతీ యువకులకు సైతం ఉంటుంది.

**రక్తపోటు**

రక్తపోటు ఆరోగ్యవంతులైన వారిలో 120/80 ఉండాలి. అయితే, దీనిని మించి అధిక రక్తపోటుకు గురైతే మాత్రం అది గుండె ఆరోగ్యాన్ని, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె పోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉంటే చిన్న వయసులోనే వారసుల్లో ఇవి కనిపించొచ్చు. ఇటీవలి కాలంలో మనం 40–50 ఏళ్ల మధ్యలో సెలబ్రిటీల మరణాలు చూస్తున్నాం. యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోవడం కనిపిస్తోంది. గుండెకు సంబంధించి ఎక్కువ ముప్పు కలిగించే వాటిల్లో అధిక రక్తపోటు ఒకటి. అందుకే కనీసం మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలి.

**టైప్ 2 మధుమేహం**

టైప్ 2 మధుమేహం రిస్క్ కూడా యువతీ యువకుల్లో పెరుగుతోంది. 14 నుంచి 25 ఏళ్ల వయసులోపు వారిలో ఈ కేసులు 20 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం బారిన పడిన వారు దీన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే అది శరీరంలోని కీలక అవయవ వ్యవస్థను దెబ్బతీస్తుంది.

**ఆస్టియో పోరోసిస్**

చిన్న వయసులో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. 35 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎముకలు ఈ సాంద్రతను క్రమంగా కోల్పోతుంటాయి. ఆస్టియోపోరోసిస్ సమస్య బారిన పడిన వారిలో ఇది మరింత వేగంగా జరుగుతుంది. అంటే ఎముకలను బలహీన పరుస్తుంది. దీంతో ఫ్రాక్చర్ల ముప్పు పెరుగుతుంది. జారి పడిపోయినా, బ్యాలన్స్ తప్పినా ఫ్రాక్చర్ల బారిన పడుతుంటారు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో ఈ రిస్క్ ఎక్కువ. కానీ నేటి జీవనశైలితో 30, 40 ఏళ్లల్లోనూ దీని బారిన పడుతున్నారు.

**బవెల్ కేన్సర్**

**దీన్నే పేగు కేన్సర్ అని కూడా అంటారు. చిన్న పేగు, పెద్ద పేగు, పురీష నాళం (రెక్టమ్)లో ఎక్కడైనా ఇది రావచ్చు. దీనికి కచ్చితమైన కారణాలను ఇప్పటికీ గుర్తించలేదు. కాకపోతే అతిగా మద్యం సేవించే వారు, ఫైబర్ లేని ఆహారం తీసుకునే వారికి రిస్క్ ఎక్కువని పలు అధ్యయనాల్లో గుర్తించారు. ఎక్కువగా యుక్తవయసులో వారు దీని బారిన పడుతున్నారు. 1950ల్లో పుట్టిన వారితో పోలిస్తే 1990ల్లో పుట్టిన వారికి దీని రిస్క్ రెట్టింపు ఉంటుందట.**

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రోజువారీ వ్యాయామం చేస్తూ నిశ్చలమైన జీవనశైలికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. పీచు పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మద్యపానం, సిగరెట్లకు స్వస్తి చెప్పాలి. ఏడాదికోసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



**35 శాతం మందికి బీపీ**

**ఐసీఎంఆర్ నివేదిక వెల్లడి**

**కొంత మెరుగ్గా తెలుగు రాష్ట్రాల పరిస్థితి**

# దేశ జనాభాలో 11 శాతం మందికి మధుమేహం

దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరిగిపోతోందని, బీపీ బాధితులు కూడా ఎక్కువేనని ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. జనాభాలో 11 శాతం మందికి మధుమేహం ఉందని పేర్కొంది. మరో 15 శాతం మంది ప్రీడయాబెటిక్ స్టేజిలో ఉన్నారని తెలిపింది. బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య తక్కువేం కాదని, మొత్తంగా 35.5 శాతం మంది రక్తపోటు బాధితులేనని వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయని తెలిపింది. ఈ పరిశోధనా పలితాలను లాన్సెట్ జర్నల్ కూడా ప్రచురించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం చేపట్టినట్లు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో భాగంగా 1,13,043 మంది నుంచి నమూనాలు సేకరించి, విశ్లేషించామని వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. మధుమేహం, బీపీ బాధితుల విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే ఉందని చెప్పారు. మధుమేహ బాధితులు ఎక్కువగా గోవా, పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీలలో ఉన్నారని, ఈ జాబితాలో తెలంగాణ 17వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచాయని తెలిపారు. తెలంగాణలో 9.9 శాతం, ఏపీలో 9.5 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని చెప్పారు.

CK చంద్రకాంత్ NEWS తెలుగు దినపత్రిక
మంగళవారం | తెలంగాణ
14 జనవరి 2025
cknews@gmail.com

Follow:
@cknews

# కీర్తి సురేష్ కూడా రష్మిక రూట్లోనే..



'మహానటి' సినిమాతో ఉత్తమ నటిగా నేషనల్ అవార్డుని కీర్తి సురేష్ అందుకున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమాతో మలయాళీ ముద్దుగుమ్మ కీర్తి సురేష్ తెలుగు వారికి ఇష్టమైన కథానాయిక అయిపోయింది. అయితే 2013లోనే కీర్తి హీరోయిన్ గా మాతృభాష మలయాళంలో అరంగేట్రం చేసింది. 2015లో తమిళంలోకి ఎంట్రీ ఇచ్చింది. ఇక 2016లో 'నేను శైలజ' చిత్రంతో తెలుగులోకి అడుగుపెట్టింది. ఆ మూవీ సూపర్ హిట్ అయ్యింది. తరువాత 'నేను లోకల్' తో మరో సక్సెస్ ని అందుకుంది.

మూడో సినిమానే ఏకంగా పవన్ కళ్యాణ్ తో చేసే ఛాన్స్ ని 'అజ్ఞాతవాసి' మూవీతో కీర్తి సురేష్ అందుకుంది. అయితే ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. 2018లో వచ్చిన 'మహానటి' మూవీ ఆమెకి ఏకంగా బెస్ట్ యాక్టర్ గా నేషనల్ అవార్డు తెచ్చిపెట్టింది. ఆ సినిమాతో స్టార్ హీరోయిన్ గా కీర్తి సురేష్ మారిపోయింది. తెలుగు, తమిళ్, మళయాళ భాషలలో వరుస సినిమాలు చేస్తూ బిజీ అయిపోయింది. అయితే కీర్తి సురేష్ నటిగా తన పెర్ఫార్మెన్స్ తో అందరికి చేరువ అయిన కమర్షియల్ హీరోయిన్ అనే ముద్ర వేసుకోలేకపోయింది.

ఎక్కువగా ఆమె పక్కింటి అమ్మాయి తరహా పాత్రలలోనే కనిపించింది. సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడీగా నటించిన 'సర్కారు వారి పాట' సినిమాతో కీర్తి సురేష్ రూట్ మార్చింది. అప్పటి నుంచి గ్లామర్ రోల్స్ చేయడం మొదలు పెట్టింది. ఇక కీర్తి సురేష్ కంటే ఆలస్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రష్మిక మందన ఓ వైపు పెర్ఫార్మెన్స్ కి స్కోప్ ఉన్న క్యారెక్టర్స్ చేస్తూనే గ్లామర్ రోల్స్ కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

కమర్షియల్ మూవీస్ లలో కూడా పెర్ఫార్మెన్స్ పరంగా అందరిని మెప్పించసాగింది.

దీంతో చాలా వేగంగా ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్ అయిపోయింది. 'గీతాగోవిందం', 'భీష్మ', 'సరిలేరు నీకెవ్వరూ' లాంటి సినిమాలతో టాప్ చైర్ లోకి రష్మిక వచ్చేసింది. 'పుష్ప' మూవీ పూర్తిగా ఆమె ఫేట్ ని మార్చేసింది. నేషనల్ వైడ్ గా ఆమెకి పుష్ప క్రేజ్ తీసుకొచ్చింది. తరువాత 'యానిమల్' సినిమాలో ఓ వైపు పెర్ఫార్మెన్స్ తో అందరిని మెప్పిస్తూనే మరో వైపు బోల్డ్ ఇంటిమెంట్ సన్నివేశాలలో నటించి స్టార్ హీరోయిన్ గా పెర్ఫెక్ట్ ఛాయస్ అనిపించుకుంది.

'పుష్ప 2' మూవీతో ఇప్పుడు మరో సూపర్ సక్సెస్ ని అందుకోబోతోంది. నెక్ట్స్ హిందీలో ఛత్రపతి శంభాజీ మహారాజ్ బయోపిక్ తో వస్తోన్న ఛావా మూవీతో ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. విక్కీ కౌశల్ ఈ మూవీలో టైటిల్ రోల్ పోషించారు. దీంతో పాటు మరో హిందీ సినిమాలో ఛాన్స్ అందుకుంది. అలాగే తెలుగులో రెండు సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం సౌత్ లో హైయెస్ట్ పెయిడ్ హీరోయిన్స్ లలో ఒకరుగా రష్మిక ఉంది. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా రష్మిక బాటలోకి వచ్చినట్లు తెలుస్తోంది. 'బేబీ జాన్' సినిమాతో కీర్తి హిందీలోకి అడుగుపెడుతోంది. ఈ సినిమా నుంచి రీసెంట్ గా వచ్చిన సాంగ్ లో ఆమె గ్లామర్ షోతో ఎట్రాక్ట్ చేసింది. ఈ చిత్రంతో బాలీవుడ్ ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తే పాన్ ఇండియా హీరోయిన్స్ రేసులోకి కీర్తి సురేష్ వచ్చే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు. మరి అమ్మడు భవిష్యత్తు అడుగులు ఎలా ఉంటాయో చూడాలి.



**ఆకాంక్ష పూరి స్టైల్ జర్నీ స్ఫూర్తిదాయకంగా ఉంది**



**ఆకాంక్ష పూరి స్టైల్ జర్నీ స్ఫూర్తిదాయకంగా ఉంది**

# అనుపమ.. చీరలో చందమామ..



మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ప్రకృతి మధ్య విహరిస్తూ అందమైన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంది. అభిమానులకు అమ్మడు తన కొత్త లుక్‌ను పరిచయం చేసిన విధానం చాలా డిఫరెంట్ గా ఉంది. అందమైన చీరలో ప్రకృతి సోయగాల మధ్య ఆమె హాయిగా నవ్వులు చిందిస్తూ కనిపిస్తుండటంతో ఈ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

అనుపమ తన చిరునవ్వుతోనే ఎట్రాక్ట్ చేస్తోంది. ఇక ఆమె చీర అందానికి పెద్ద ఎత్తున పాజిటివ్ రియాక్షన్స్ వస్తున్నాయి. ఈ ఫోటోల్లో అనుపమ చెట్లతో కూడిన ప్రదేశంలో ఉత్సాహంగా, ఆహ్లాదంగా విహరిస్తూ కనిపించారు. ఆమె చీర, ఆ చీరపై పడిన పగటిపొద్దు కిరణాలు ఆమె అందాన్ని మరింత మెరిపిస్తున్నాయి. అలా సాంప్రదాయబద్ధమైన చీరలో తన అందాన్ని ఎలివేట్ చేస్తూ అనుపమ చూపిన నవ్వులు నెటిజన్లకు కనువిందుగా మారాయి. "కాదల్ ముగమ్ కండుకోండేన్" అంటూ అనుపమ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. ఆమె చీరలో ఈ అందమైన ఫోటోలు చూసిన అభిమానులు కాస్తా ఔరా అనకుండా ఉండలేకపోతున్నారు. ప్రాచీన గమకాలు ఉన్న ఈ చీరలో ఆమె అందం ఒక సరికొత్తగా మెరిసిపోతోంది. ఇక అనుపమ తాజా ప్రాజెక్టులు పరిశీలిస్తే, "టిల్లు స్క్వేర్" సినిమాలో తన గ్లామర్ పాత్రతో కొత్తదనం చూపించి, ప్రేక్షకులను ఎట్రాక్ట్ చేశారు. అనుపమ ఇటీవల రెగ్యులర్ కమర్షియల్ పాత్రలు కాకుండా ప్రాధాన్యత ఉన్న పాత్రలను మాత్రమే ఎంపిక చేసుకుంటూ సుదీర్ఘ కెరీర్ కోసం అడుగులు వేస్తున్నారు. గ్లామర్‌తో పాటు, కథానాయకిగా విలువైన పాత్రలను పోషించాలనే ఆమె దృక్పథం అభిమానులకు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం అనుపమ తెలుగులో పాన్ ఇండియా సినిమాల్లో నటించడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లోనూ అవకాశాల కోసం ఆలోచిస్తున్న అనుపమ, త్వరలో మరిన్ని కొత్త సినిమాల్లో కనపడతారని అభిమానులు ఆశాభావంతో ఉన్నారు. ఇక ప్రస్తుతం ఆమె చేతిలో 4 మలయాళం సినిమాలు ఉన్నాయి. అలాగే మూడు తమిళ సినిమాలు ఉన్నాయి. మరి ఆ సినిమాలు అనుపమకు ఎలాంటి విజయాన్ని అందిస్తాయో చూడాలి.